క్లుప్తంగా

అందుబాటులో వర్మీ కంపోస్ట్



ఎస్‌డబ్ల్యూపీసీలో వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బేస్తవారిపేట: పెద్ద ఓబినేనిపల్లె పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీలో వర్మీ కంపోస్ట్ అందుబాటులో ఉందని కావాల్సిన రైతులు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. బుధవారం పెద్ద ఓబినేనిపల్లె, పిటికాయగుళ్ల పంచాయతీల్లో పర్యటించి తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



చెరువు తూమును పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కంచిపల్లె గ్రామంలో రంగారెడ్డిచెరువు, తాళ్లపల్లె గ్రామంలో మైనర్ ఇరిగేషన్ చెరువులను స్థానిక ఇరిగేషన్ డీఈ రామారావు బుధవారం పరిశీలించారు. తూముల మరమ్మతులు, పంట కాలువలు, సప్లై చానళ్లలో పూడికతీత పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు డీఈ తెలిపారు. ఆయన వెంట ఏఈ వెంకటరామిరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు బొర్రా శేఖర్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

తర్లుపాడు: మండలంలోని మీర్జపేట జెడ్పీ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు బి.స్వామికుమార్, బి.కృష్ణారెడ్డి, కె.రవి శేఖర్, ఎం.ప్రసూన, ఎస్వీ రమేష్‌బాబును హెచ్‌ఎం కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణల్లో అప్రమత్తంగా ఉండాలి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని, మార్పులు, చేర్పులు, నూతన ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. బుధవారం మార్కాపురంలో బీఎల్‌ఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి నూతన ఓటర్లను చేర్పించాలని సూచించారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ మార్కాపురం మండలంలో 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న 14 పోలింగ్ కేంద్రాలను రెండుగా విభజించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నారాయణరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తర్లుపాడులో హాస్టల్ బయట దుస్తులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు



పొదిలిలో పెచ్చులూడుతున్న బీసీ బాలుర హాస్టల్ శ్లాబ్



గొట్లగట్టులో కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీ

సమస్యలు నిత్యం.. సంక్షేమం అసత్యం!

- సంక్షేమ హాస్టళ్లను చుట్టుముట్టిన సమస్యలు
- అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు కరువు
- ఆరుబయటే స్నానం.. పొలాల వెంట బహిర్భూమికి..
- విద్యార్థులను వేధిస్తున్న తాగునీటి సమస్య
- రాత్రి భోజనం తిన్నాక ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు
- మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

మార్కాపురం టౌన్:

సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యార్థుల బాగోగుల కోసం తీసుకుంటున్న చర్యలు, ఖర్చు చేస్తున్న నిధులపై హైకోర్టు నేరుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినా పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం. హాస్టళ్లలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటే స్నానం చేస్తూ, పొలాల వెంట బహిర్భూమికి వెళ్తున్న దుస్థితి. పాఠశాలలు ప్రారంభమై 28 రోజులైనా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల హాస్టళ్లలో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వర్షాకాలం కావడంతో రాత్రిపూట దోమల దెబ్బకు విద్యార్థులు నిద్రకు దూరమవుతున్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో బాలికల కోసం ఇటీవలే ప్రత్యేక హాస్టల్ మంజూరైనప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణానికి మార్కాపురం రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు తదితర మండలాలకు చెందిన బాలికలు 150 మందికి పైగా మార్కాపురంలో చదువుకుంటున్నారు. బీసీ బాలికల హాస్టల్ లేకపోవడంతో పలువురు విద్యార్థినులు పీజీ హాస్టళ్లలో, మరికొందరు అద్దె గదుల్లో ఉంటూ అవస్థలు పడుతున్నారు. మార్కాపురం పట్టణంలో ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్లో(ఇంటర్ నుంచి పై చదువుల వరకు) విద్యార్థులకు సరిపడా వసతి గదులు, టాయిలెట్లు, బాత్‌రూములు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.



గొట్లగట్టు బీసీ హాస్టల్లో ఆరుబయటే స్నానాలు

అద్దె భవనంలో అష్టకష్టాలు

తర్లుపాడు: తర్లుపాడు బీసీ హాస్టల్లో సుమారు 70 మంది విద్యార్థులు ఉన్నారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఈ హాస్టల్లో బాత్‌రూము, టాయిలెట్‌లు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యార్థులు సమీప పొలాల్లోకి బహిర్భూమికి వెళ్తున్నారు. అంతేకాక ఆరుబయట స్నానం చేస్తున్నారు. హాస్టల్ బయట కుళాయిల వద్ద దుస్తులు శుభ్రం చేసుకుంటున్నారు. గతంలో బహిర్భూమికని బయటకు వెళ్లిన సమయంలో పలువురు విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యారు. బీసీ హాస్టల్‌ను వసతులు కలిగిన సొంత భవనంలో నిర్వహించాలని ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

తాగు నీటికి కటకట

పొదిలి: పట్టణంలో రెండు వెనుకబడిన తరగతుల వసతి గృహాలు, రెండు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఒక కేజీబీవీ ఉన్నాయి. వీటిలో సుమారు 600 మంది బాల బాలికలు ఉంటున్నారు. వాడుక అవసరాలకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. కానీ తాగునీటి సమస్య విద్యార్థులను వేధిస్తోంది. బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. కొన్ని గదుల్లో శ్లాబు పెచ్చులూడుతోంది. వర్షం కురిస్తే శ్లాబు నుంచి నీరు ఉరుస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు ఆరుబయటే సాగుతున్నాయి.

ఇరుకు గదుల్లో అవస్థలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాల్లో ఎస్సీ వసతి గృహాలు, గొట్లగట్టులోని బీసీ హాస్టల్లో సుమారు 150 మంది వసతి పొందుతున్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, నీటి వసతి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే బహిర్భూమికి వాటర్ బాటిళ్లు తీసుకుని ఊరిబయటికి వెళ్తున్న దుస్థితి. ఇరుకు గదుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొనకనమిట్ల ఎస్సీ హాస్టల్‌ను కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. ఒక్క హాల్లోనే విద్యార్థులు వారి పెట్టెలు పెట్టుకుని ఓ పక్క పడుకోవాల్సిన పరిస్థితి. తలుపులు సరిగా లేకపోవడంతో కోతులు లోపలికి దూరి రచ్చరచ్చ చేస్తున్నాయి. దీంతో హాస్టల్లో ఉండే పక్క గ్రామాల పిల్లలు రాత్రి భోజనం తిని పడుకోవడానికి ఇళ్లకు వెళ్తున్నారు. గొట్లగట్టు హాస్టల్ ముందు ప్రహరీ కూలేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం మానేశారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందించరా? అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వార్డెన్లుగా ఇన్‌చార్జిలను నియమించడంతో హాస్టళ్లకు మొక్కుబడిగా వచ్చివెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి.



తర్లుపాడులో ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు



తర్లుపాడులో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ బాత్‌రూములు, టాయిలెట్లు

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- డీఎస్పీ నాగరాజు సూచన

మార్కాపురం: విద్యార్థులు డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ డాక్టర్ నాగరాజు సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, చట్టపరమైన శిక్షలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పట్టణంలోని సాధనా జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు సెల్ఫ్ డిఫెన్స్ మెళకువలు తెలుసుకోవాని, స్మార్ట్‌ఫోన్లలో ఇతరులు పంపే వెబ్ లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో 100, 112 ఫోన్ నంబర్లను వినియోగించుకుని పోలీసుల సాయం పొందవచ్చని చెప్పారు. డిజిటల్ అరెస్టు అంటూ ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే తక్షణమే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై అంకమరావు, ప్రిన్సిపాల్ ప్రసాదరావు, డైరెక్టర్ జీఎల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

ఆవేశంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవద్దు

మార్కాపురం టౌన్: మనుషులు ఆవేశంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.బాలాజీ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం మార్కాపురంలోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారు చేసిన నేరాలు, శిక్షా కాలం తదితర వివరాలు తెలుసుకున్నారు. జడ్జి మాట్లాడుతూ.. మంచి చెడును గ్రహించే విచక్షణ జ్ఞానాన్ని దేవుడు మనుషులకు ఇచ్చారని, కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు విచ్ఛిన్నమైనప్పుడు సమాజంలో శాంతి ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను అతిక్రమించకూడదని అన్నారు. మత్తు పదార్థాలను వాడిన యువత ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసుకోవడమే కాక కుటుంబ సభ్యులకు దూరమవుతారని తెలిపారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది, చెడు అలవాట్లను వీడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థను ఏర్పరుచుకోవాలని హితవు పలికారు. ఉచిత న్యాయ సహాయం, అరెస్టులు, జైలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి వెంట సబ్ జైలు సిబ్బంది ఉన్నారు.



సబ్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాలాజీ

స్కూల్ బస్సుల తనిఖీ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో 18 స్కూల్ బస్సులను బుధవారం తనిఖీ చేసినట్లు ఎంవీఐ మాధవరావు తెలిపారు. ఇటీవల పలుచోట్ల స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేక ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. బస్సుల కండిషన్‌ను రోజూ పరిశీలించుకోవాలని డ్రైవర్లకు స్పష్టం చేశారు.

కారును ఢీకొట్టిన ట్రాక్టర్

రాచర్ల: మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కారును ఢీకొట్టింది. ఈ సంఘటన రాచర్ల ఫారం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. నంద్యాల జిల్లా చింతలాయపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ రాచర్ల నుంచి మట్టిలోడుతో గిద్దలూరు వెళ్తోంది. గిద్దలూరు నుంచి రాచర్లకు వస్తున్న కారును రాచర్లఫారం వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ సీహెచ్ నాగరాజు, కారు డ్రైవర్ చిట్టెం సునీల్ సురక్షితంగా బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పి.కోటేశ్వరరావు పరిశీలించి ఇద్దరు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పీర్లచావిడి వద్ద ఉన్న అగ్నిగుండాన్ని పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. రాత్రి 11 గంటలకు పీర్లను గుండం చుట్టూ తిప్పిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముజావర్లు షేక్.నాయబ్‌రసూల్, చింతకుంట్ల ఇబ్రహీమ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి



నాగంపల్లిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి, పెదారికట్ల, ఇరసలగుండం, నాయుడుపేట, కొత్తపల్లి, మునగపాడు గ్రామాల్లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ జయంతిని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పగలు వ్యవసాయ పనులు చేసుకున్న వైఎస్సార్ అభిమానులు రాత్రి పూట జోరువానలోనే మహానేతను విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం సబ్‌స్టేషన్‌లో ఆర్డీఎస్ఎస్ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ముండ్లపాడు ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. వెంగళరెడ్డిపల్లె, జయరాంపురం, వెల్లుపల్లె గ్రామాల్లో గృహాలు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

రేపు శాకంబరీ దేవిగా వాసవీ మాత

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

- కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి
- సార్వత్రిక సమ్మెలో వామపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్

కేంద్ర ప్రభుత్వానిది నిరంకుశ ధోరణి

సాక్షి నెట్‌వర్క్: అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, కార్మికుల హక్కులు హరించే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఆయా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బంద్ నిర్వహించి నిరసన ర్యాలీలు చేపట్టారు.

మార్కాపురం ర్యాలీలో సీపీఐ, సీపీఎం నాయకులు అందె నాసరయ్య, ఖాశీం, రఫీ తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్స్‌గా మార్చు చేయడం దుర్మార్గమన్నారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం, పని గంటలను 8 నుంచి 10కి పెంచడాన్ని తప్పుబట్టారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మార్కాపురం హెడ్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

☛ కొనకనమిట్లలో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు బాలనరసయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న వామపక్షాలు, కార్మిక సంఘ నాయకులు

☛ గిద్దలూరులో కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ.. యాజమాన్యాలకు సంపద సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 10కి పెంచేందుకు పూనుకోవడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఒప్పంద కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, నరసింహులు, బి.పూర్ణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

☛ బేస్తవారిపేటలో ఏపీ రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రధాని చెప్పే మాటలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు పన్ను తగ్గించడమే కాకుండా ప్రభుత్వ బ్యాంకుల బకాయిలు రూ.16.61 లక్షల కోట్లు రద్దు చేయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తోట తిరుమలరావు, యు.జోసఫ్, రాతం యోగయ్య, డి.ఖలీల్, జి.అబ్రహాం, ఎ.సరళాదేవి, డి.జరీనా,, బి.రవి, భారతి, బాలేశ్వరమ్మ పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో ప్రజా సంఘాల నిరసన ర్యాలీ

☛ కంభంలో కార్మికుల ర్యాలీ అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకం పని దినాలు 200కు పెంచాలని, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిటీ నియమించాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రోశయ్య, నాసర్‌వలి, మహబూబ్ బాషా, జైనాబి, రియాజున్, కాశీ రత్నమ్మ, శ్రీలక్ష్మి, సరళ, లక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.